క్లుప్తంగా

ఉత్కంఠగా 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ పోటీలు



సత్తెనపల్లి: ప్రతిభ గల క్రీడాకారుల గుర్తింపే లక్ష్యంగా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సత్తెనపల్లి మండలం కొమెరపూడి, నందిగామ, ఫణిదం, భృగుబండ గ్రామాల్లో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. క్రీడలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున అభిమానులు ఆయా మైదానాలకు చేరుకొని క్రీడలను వీక్షించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ నేతృత్వంలో నోడల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



ముప్పాళ్ల: గ్రామానికి చెందిన పాలేటి సమాధానం, పలుకూరి అచ్చమ్మ గుంటూరు జీజీహెచ్‌లో మోకాళ్ల నొప్పితో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులు కావటంతో వలంటీర్లు గద్దల రాంబాబు, మన్నం కోటేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం



తొండపి(ముప్పాళ్ల): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్ పాల్గొని ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకున్న ఓటరు తాను ఏ గుర్తుపై ఓటు వేసిందో వీవీ ప్యాట్‌ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్లకు ఈవీఎంలపై ఉన్న సందేహాలను పరిష్కరించారు. పలువురి ఓటర్లతో ఈవీఎం ద్వారా నమూనా ఓటు వేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ



అచ్చంపేట: రాష్ట్రంలో విద్యాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాదిపాడు, పెదపాలెం, కొండూరు, కోనూరు గ్రామాలలో శనివారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ప్రతి ఏటా జిల్లా పరిషత్ ద్వారా జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు వీటి ద్వారా మంచి మార్కులు సాధించాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, యుఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సీహెచ్ ఆగస్టస్ ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి-1 ఏ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి-2 ఏ రాఘవేంద్రరావు హాజరై డైరీ-2024, క్యాలెండర్, వాల్‌పోస్టర్‌ను ఆవిష్కంచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు బంకా వాసుబాబు, జి.సునీల్‌బాబు, జె.ఏసురత్నం, జిల్లా నాయకులు వి.అశోక్, కె.ప్రేమ్‌కుమార్, కె.ఏడుకొండలు, డయాస్, కె.రామ్మోహనరావు, సీహెచ్ బిక్షాలు, ఎస్.రమేష్, టీ సుబ్బారావు, కేసీహెచ్ నర్సింహారావు పాల్గొన్నారు.

రాజకీయ శిఖరాగ్రానికి చేరిన తెలుగువాడు పీవీ

- మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో మాజీ ప్రధాని పీవీ విగ్రహావిష్కరణ



సభలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

సత్తెనపల్లి: బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సమైక్యవాదిగా, సమాజంతో కలసి ఎదిగి రాజకీయ శిఖరాగ్రానికి చేరిన తెలుగువాడు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ఆదర్శనీయుడని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు కొనియాడారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వే స్టేషన్ రోడ్ మార్గంలో బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని పీవీ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. సభకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తాను శాసనసభ్యుడిగా పని చేస్తూ ఆయనను కలిసేటువంటి ప్రత్యక్ష అనుభవం ఉందని గుర్తు చేసుకున్నారు. పీవీ తెలుగువాడు కావడం మనకు గర్వకారణమన్నారు. బాపట్ల శాసనసభ్యుడు కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా అనేక బాధ్యతలను నిర్వహించిన పీవీ నరసింహారావు తెలుగుజాతికే వన్నెతెచ్చాడని వివరించారు. అన్ని పదవులను సమర్థంగా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు నాగరాజు, గౌరవ అధ్యక్షుడు బలరామకృష్ణ మూర్తి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి కోనంకి మారుతి, స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య మనవడు మన్నవ సోడేకర్, నాయకులు పక్కాల సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ ఐక్య వేదిక అధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వేదాంతం వెంకట హర్‌నాథ్, కార్యదర్శి కొడవటికంటి నాగపార్వతయ్య, కోశాధికారి అంపిరాయని రాజశేఖర్, మాజీ అధ్యక్షుడు మోతే పురుషోత్తమశర్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అత్తలూరులో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్ రూ.3 వేలకు పెంచి అవ్వాతాతల ఆనందం చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిధిలోని అత్తలూరులో పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అత్తలూరులో 2019లో కేవలం 582 మందికి రూ.5.93 లక్షలు మాత్రమే ఇచ్చేవారని, కానీ ఇప్పుడు 812 మందికి ప్రతి నెలా రూ.23.91 లక్షలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు మాదినేని హరిబాబు, ఎం.సతీష్, ఎస్.నరసయ్య పాల్గొన్నారు.

మండల పరిధిలోని లింగాపురంలో రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుమాళ్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

అచ్చంపేట: ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. స్థానిక సచివాలయం- 1 వద్ద శనివారం ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచి కంబాల వీరబాబు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి రంగయ్య, ఉప సర్పంచి జాని పాల్గొన్నారు.



అచ్చంపేటలో హర్షం వ్యక్తం చేస్తూ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరరావు

పేదల సంక్షేమానికి జగనన్న లక్ష్యం

అచ్చంపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. పెన్షన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. మండలంలో 9079 మంది పెన్షనర్లకు రూ.2.71 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



చంద్రాజుపాలెంలో హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ నాయకులు

బెల్లంకొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాలలో శనివారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో హెల్త్ కార్డులను ప్రతి ఒక్కరూ పొందాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎక్కడైన ఆరోగ్య భద్రతగా నిలిచే ఈ హెల్త్ కార్డుల ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్య చికిత్సకు ఉపయోగ పడుతుందని తెలిపారు. అదే విధంగా ప్రతి ఇంటిలో మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్న సంకల్పంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యంత్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, చింరెడ్డి సాయిరెడ్డి, కారుమూరి భద్రయ్య, గాదె మిల్లు వెంకటరెడ్డి, సర్పంచ్‌లు కొడవటి బాబూజీ, కంభంపాటి పాప, ఏవో కృష్ణయ్య, పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వరరావు, అంసూధర్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అచ్చిరెడ్డి మృతి

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మర్రి అచ్చిరెడ్డి (67) శనివారం మృతి చెందాడు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి బెల్లంకొండ జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేయడంతో ఆవిర్భావంలోనే పార్టీలో చేరి, పార్టీ గెలుపు కోసం పని చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అచ్చిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, జగ్గయ్యపేట పార్టీ పరిశీలకులు నూతలపాటి హనుమయ్య, నాయకులు పులివర్తి రత్నబాబు నివాళులర్పించారు.

కందికి మద్దతు ధర రూ.7,500

నకరికల్లు: కంది క్వింటాకు రూ.7,500 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో కంది సాగు రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.ప్రసన్నకుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలోని అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది శనివారం దాడి చేశారు. దాడుల్లో అక్రమంగా గ్రామంలో మద్యం విక్రయిస్తున్న తూమాటి లక్ష్మీనారాయణ, గుడిసె యశోదమ్మలపై కేసు నమోదు చేసి, వీరి వద్ద నుంచి పలు మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

'ప్రకృతి'లో రైతులకు అధిక లాభాలు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు జిల్లా మేనేజర్ అమలకుమారి

నకరికల్లు: వర్షాభావ పరిస్థితులను అధిగమిస్తూ తొమ్మిది సూత్రాల ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక విధానాల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ఏడీఏ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ అమలకుమారి సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏకపంట విధానం విడనాడి బహుళ పంటలు సాగుచేయడం ద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వివరించారు. 30 రకాల విత్తనాలు అందజేసి ప్రకృతి విధానంలో సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి, మిర్చి, పత్తి పంటలు సాగుచేస్తూ వాటిలో అంతర పంటలు సాగు చేస్తే చీడపీడలను నివారించవచ్చన్నారు. ఆవు పేడ, మూత్రం, బెల్లం, పుట్టమన్ను కలిపి ఘనజీవామృతం, ద్రవజీవామృతం, మొక్కల ఆకులతో కషాయాలు, బయోస్టిమిలెంట్స్ అయిన ఎగ్ అమినోయాసిడ్, ఫిష్ అమినోయాసిడ్ తయారీ విధానం, వినియోగాలను వివరించారు. మూడు సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులకు పీజీఎస్ సర్టిఫికెట్‌లు ప్రభుత్వం ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. సర్టిఫికెట్ పొందిన రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కడైనా విక్రయించుకోవచ్చని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీ బాషా, సలీల్, శాగం చంద్రశేఖర్ రెడ్డి, పరసా సాంబ, కార్యదర్శి భావన్నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



జెడ్పీ హైస్కూలులో స్పోకెన్ ఇంగ్లిష్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు సతీమణి వసంతకుమారి

అచ్చంపేట: విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే తప్పనిసరిగా ఇంగ్లిష్ మీడియంలో చదవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి అన్నారు. ఆపన్న హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు శనివారం ఆమె రూ.30 వేలు విలువ చేసే స్పోకెన్ ఇంగ్లిష్ వశిష్ట బుక్స్ పంపిణీ చేశారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఆపన్న హస్తం ఫౌండేషన్ ప్రతినిధి షేక్ కమల్‌సైదా, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచి కంబాల వీరబాబు, ఉప సర్పంచి షేక్ జాని, బీరువాల జాని, పాఠశాల కమిటీ చైర్మన్ మొగిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయం ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని తాడువాయిలో కొలువై ఉన్న శివాలయం ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో ప్రహరీ నిర్మాణం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చాగంటివారిపాలెం ఆర్బీకేలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు వరప్రసాదరావు, రమేష్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): శనగ రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు పాటించాలని డాట్ సెంటర్(ఏరువాక) శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, డాక్టర్ జి.రమేష్ చెప్పారు. గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో శనగ, మిరప పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రస్తుతం శనగ పంటలో తుప్పు తెగులు ఆశించే అవకాశం ఉందని, ఆకులపై తుప్పు మచ్చలు గమనించిన వెంటనే లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2.0 మి.లీ. లేదా ప్రాఫికొనజోల్ 1.0 మి.లీ. వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. మిరపను ఆశించే ముడత తెగుళ్ల రసం పీల్చే పురుగు ఆశించడం ద్వారా వ్యాప్తి చెందుతాయని, నివారణకు థయోమిథాక్సైం లేదా ఎసిటమప్రైడ్ 40గ్రా. ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం నల్లతామర పురుగు గమనించినట్లయితే లీటరు నీటికి ఫిప్రోనిల్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థినులు, వీఏఏ శైలజ పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

అచ్చంపేట: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సంఘం వజ్రోత్సవాల పోస్టర్‌ను ఎంఈఓ నరసింహారావు శనివారం ఆవిష్కరించారు. ఈనెల 12,13 తేదీలలో కర్నూలులో సభలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షులు జి.గంగయ్య, ప్రధాన కార్యదర్శి వి.వీరవాసు, గంగాధర్, బి.సాంబశివరావు, శ్రీనివాసరావు, పి.సురేష్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యసేవలు అభినందనీయం

మాచర్ల: ఉత్తమ సేవలందిస్తూ పేదలందరికీ ఎప్పటికప్పుడు వైద్యాన్ని చేస్తూ కష్టపడుతున్న మాచర్ల కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందనీయులని జిల్లా వైద్యశాఖాధికారి బి.రంగారావు అన్నారు. శనివారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగారావు, సావిత్రి దంపతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యంతో పేదలకనుగుణంగా పనిచేయటం ఎంతో మంచి పరిణామమన్నారు. ఇటువంటి వైద్యులు దొరకటం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బత్తుల ఏడుకొండలు, నియోజకవర్గ ప్రభు త్వాసుపత్రుల గౌరవాధ్యక్షులు డాక్టర్ రామకోటయ్య, ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ ఉ దయభాను, వైద్యులు విజయలక్ష్మి, జయప్రకాష్, దినేష్, రేవతి పాల్గొన్నారు. అనంతరం జిల్లా వైద్యశాఖాధికారి రంగారావు దంపతులను, రామకోటయ్యలను శాలువాలతో సత్కరించారు.

మానవత్వమే క్రైస్తవతత్వం

- గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య
- భక్తిశ్రద్ధలతో ముగ్గురు రాజుల మహోత్సవం



దివ్యపూజాబలి నిర్వహిస్తున్న గుంటూరు పీఠాధిపతి రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య

పెదకూరపాడు: మానవత్వమే క్రైస్తవతత్వమని గుంటూరు పీఠాధిపతి రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. పాటిబండ్లలో శనివారం ముగ్గురు రాజుల వార్షికోత్సవ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భాగ్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు. ఆయన క్రీస్తు సందేశం ఇచ్చారు. తోటి వారి పట్ల ప్రేమ, ఆదరణ కలిగి ఉండాలని అన్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన ముగ్గురు రాజుల దేవాలయాన్ని సదర్శించేందుకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం భక్తులు ఒత్తుల సమర్పణ చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన 30 మంది గురువులు, మఠకన్యలు దివ్యపూజ బలిలో పాల్గొన్నారు. స్థానిక విచారణ గురువులు హృదయకుమార్, సహాయక గురువులు నందిగం సురేష్, స్థానిక పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

ఒత్తులు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

పాటిబండ్ల ముగ్గురు రాజుల తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారి ముగ్గురు రాజులకు ఒత్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండి సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరారు.

మహిళల సృజనాత్మకతకు ప్రతీకగా ముగ్గులు

- మంత్రి అంబటి రాంబాబు
- ముగ్గుల పోటీలకు 3,366 మంది హాజరు



పట్టణంలో ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మహిళల సృజనాత్మక శక్తికి ప్రతీకగా ముగ్గులు నిలుస్తాయని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో శనివారం వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను నిర్వహించారు. 24వ వార్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సంక్రాంతి పండగ ఇంకా పది రోజులు ఉండగా సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముందుగానే ముగ్గులతో సందడి ప్రారంభమైందని చెప్పారు. ముగ్గులు వేయడం వలన ఇంటికి అందమే కాక వంటికి ఆరోగ్యం కూడా వస్తుందని వివరించారు. మన సంప్రదాయంలో ఏ పనిలో అయినా ఆరోగ్య చిట్కా దాగి ఉంటుందని పెద్దలు చెబుతారని, ముగ్గులు వేయాలంటే ఉదయాన్నే లేవడం నీళ్లను తెచ్చి అందులో పేడ కలిపి చల్లడం నడుము వంచి ముగ్గులు వేయాలన్నారు. ఈ ప్రక్రియలన్నీ శరీరానికి వ్యాయామాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సంక్రాంతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. శనివారం ఒక్క రోజు 3,366 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారని తెలిపారు. ముగ్గులు వేసిన ప్రతి మహిళకు అభినందనలు తెలిపారు. విజేతలతో పాటు ముగ్గులు వేసిన ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతిని ఇంటికి పంపుతానన్నారు. ఈ సందర్భంగా 4వ వార్డులో 156 మంది, 5వ వార్డులో 26 మంది, 6వ వార్డులో 75 మంది, 7వ వార్డులో 45 మంది, 8వ వార్డులో 101 మంది, 13వ వార్డులో 184 మంది, 14వ వార్డులో 116 మంది, 15వ వార్డులో 70 మంది, 16వ వార్డులో 90 మంది, 17వ వార్డులో 96 మంది, 18వ వార్డులో 65 మంది, 23వ వార్డులో 90 మంది, 24వ వార్డులో 92 మంది, 30వ వార్డులో 91 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, కౌన్సిలర్లు సయ్యద్ సలీం, సదనం సత్యవాణి, బండి రాజ్యలక్ష్మి, గద్దం శ్రీలత, గంటా రమణమ్మ, సెగ్గెం పద్మావతి, తోట వెంకట సుధారాణి, ఆకుల రమేష్ బాబు, అచ్యుత శివప్రసాద్, వార్డు ఇన్‌చార్జ్‌లు బచ్చు మనోహర్, దేవరశెట్టి రవికుమార్, రేపూడి విజయకుమారి, ఉల్లంగుల విజయలక్ష్మి పాల్గొన్నారు.

విధులకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదకూరపాడు: ని యోజకవర్గంలోని పెదకూరపాడు, అచ్చంపేట మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం వి ధులకు హాజరయ్యారు. పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు-5, లగడపాడు-1,3, పొడపాడు--1, 75 త్యాళ్ళూరు గ్రామంలోని 1,2,4,5 కేంద్రాలు, కంభంపాడు -2, గారపాడు-1, అచ్చంపేట మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు పని చేసే కార్యకర్తలు, ఆయాలు విధులకు హాజరయ్యారు. గర్భిణులకు , బాలింతలకు, పిల్లలకు టెక్ హోం రేషన్‌ను అందించారు.

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

మాచర్ల: నియోజకవర్గంలో మదర్ థెరిస్సా సేవా సమితి తరఫున ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న సేవా సమితి సేవలు మరువలేనివని వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు రాయపరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. నాగిరెడ్డి, రాయపరెడ్డి మాట్లాడుతూ సమాజసేవకు కట్టుబడి ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జక్కిరెడ్డి మర్రెడ్డి, గాదె కిరీటిరెడ్డి, మోరా భాస్కర్‌రెడ్డి, అందుగుల జోజి, కసిరెడ్డి శాంతిరెడ్డి, పాపిరెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మహేష్, అందుగుల చంద్రయ్య పాల్గొన్నారు.

కొత్తూరులో హస్తకళా ప్రదర్శన

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొత్తూరులో విజయవాడకు చెందిన హస్త కళా సేవా కేంద్రం, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హస్తకళల ప్రదర్శన-శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. హస్తకళల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి మద్దిగపు అచ్చిరెడ్డి, హస్తకళ సేవా కేంద్ర సంచాలకులు ఎం.షరీఫ్, కె.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్, రచయిత పున్నా కృష్ణ మూర్తి, హస్త కళాకారులు రామారావు, నాసరయ్య, రమేష్, కృష్ణజ, ఏలే వెంకటేశ్వర్లు, తిరుమలరావు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

జెట్టిపాలెం(రెంటచింతల): విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య అన్నారు. శనివారం మండలంలోని జెట్టిపాలెం గ్రామ శివార్లో నున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో ఐటీ అండ్ ఐటీ ఈఎస్ బ్యాంకింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించి వారికి బ్యాంక్‌లో ఏటీఎం ఎలా వినియోగించుకోవాలో, దొంగనోట్లను ఎలా గుర్తించాలో, నగదును ఎలా జమ చేయాలో, బ్యాంక్ నుంచి నగదును ఎలా తీసుకోవాలో తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్య జిల్లా సమన్వయకర్త అయ్యప్పస్వామి పాల్గొన్నారు.